## క్లుప్తంగా

### మానవాళి మనుగడకు చెట్లే ఆధారం



మొక్కలు నాటుతున్న బ్యాంక్ అధికారులు

పాకాల: సమస్త మానవాళి మనుగడ సాధించేందుకు ప్రధానంగా చెట్లు ఆధారమని కెనరా బ్యాంక్ పాకాల బ్రాంచ్ మేనేజర్ రాజేష్ తెలిపారు. గురువారం మండలంలోని చిన్నగోర్పాడు ఎంపీపీ పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా నెల్లి, పాల, నీలగిరి మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ మానవ అభివృద్ధికి, మానవ విలువలకు, గౌరవానికి విద్యా అవసరమని విద్యార్థులకు సూచనలు చేశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని, దేశం గర్వించదగ్గ స్థాయికి విద్యార్థు లు ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు అందజేశారు. హెచ్‌ఎం ప్రభు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ నాగూరయ్య పాల్గొన్నారు.

### ఎస్పీతో ఆర్పీఎఫ్ సీఐ భేటీ



ఎస్పీని కలిసిన రైల్వే సీఐ మధుసూదన్

తిరుపతి(అలిపిరి): తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడును గురువారం ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి రైల్వే పరిధిలోని భద్రతా అంశాలపై చర్చించారు. పార్సిల్ కార్యాలయం, రైళ్లల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

### ఎస్పీకి అభినందనలు



జిల్లా ఎస్పీని అభినందిస్తున్న తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఇటీవల తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎల్.సుబ్బరాయుడును గురువారం తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతి భద్రతపై చాంబర్ వారికి సూచనలు, సహకారం అందించాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌రాజు, కార్యదర్శి వాసుదేవన్, కోశాధికారి అయ్యప్ప, ప్రముఖ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

### అమ్మవారి సేవలో వీజీఓ



అమ్మవారి ఆలయంలో వీజీఓ సురేంద్ర

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని టీటీడీ నూతన వీజీఓ సురేంద్ర దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డెప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజ స్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏవీఎస్‌ఓగా తిరుమలలో విధులు నిర్వహించిన అనుభవం ఉండడం, మరోసారి వీజీఓగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత అనుభవంతో శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యవంతంగా పాలనను అందించేందుకు కృషిచేస్తానని ఆయన తెలిపారు.

### విద్యా సామగ్రి వితరణ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన భానుప్రియ, జనార్దన్ దంపతులు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామయ్య అధ్యక్షతన విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం భూపతిరెడ్డి, తల్లిదండ్రుల కమిటీ మెంబర్ గోపీయాదవ్, ఉపాధ్యాయులు మైథిలి, కృష్ణమ్మ, లోకేశ్వరి పాల్గొన్నారు.

# క్యాంటీన్ ఎప్పుడు తెరుస్తారో?

- వెటర్నరీ వర్సిటీలో 3 నెలల కిందట క్యాంటీన్ మూత
- తాగునీరు కావాలంటే 2కి.మీ. వెళ్లాల్సిందే
- వర్సిటీ అధికారుల తీరుపై విద్యార్థులు, రైతుల ఆగ్రహం





మూతపడిన ఎస్వీ వెటర్నరీ వర్సిటీ క్యాంటీన్

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో క్యాంటీన్ మూతపడి సుమారు మూడు నెలలపైన కావొస్తున్నా, పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. వర్సిటీ పరిసర ప్రాంతాల్లో కనీసం రెండు కిలోమీటర్ల దూరంలో వాటర్ బాటిల్ కూడా దొరకని పరిస్థితి. దీంతో వర్సిటీలో చదువుతున్న విద్యార్థులు, మూగజీవాల వైద్యం కోసం పశువైద్యశాలకు ప్రతి రోజు వచ్చే స్థానికులు, స్థానికేతరులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్సిటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. గతంలో టెండర్ ద్వారా క్యాంటీన్‌ను దక్కించుకున్న సదరు వ్యక్తి పూర్తిస్థాయిలో క్యాంటీన్‌ను నడపలేక చేతులెత్తేశాడు. దీంతో అధికారులు మరో వ్యక్తికి క్యాంటీన్ బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. కొత్తగా క్యాంటీన్‌ను దక్కించుకున్న యాజమాన్యం సైతం మూడు నెలలు కావొస్తున్నా తెరవడానికి సాహసించకపోవడం గమనార్హం. దీంతో వర్సిటీకి శిక్షణ కోసం వచ్చే రైతులు, విద్యార్థులు, స్థానికులు వర్సిటీ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆకాష్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: ఆకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో టాలెంట్ హంట్ స్కాలర్‌షిప్ టెస్ట్–2024 నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఏపీ ఇన్‌చార్జ్ నిషాంత్ మిశ్రా తెలిపారు. గురువారం స్థానిక ఎంఆర్ పల్లిలోని ఆకాష్ విద్యాసంస్థల్లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆకాష్ సంస్థ ఆధ్వర్యంలో 15వ ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్(యాన్‌తే) పరీక్ష దేశవ్యాప్తంగా అక్టోబర్ 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా, అదే నెల 27, 28 తేదీల్లో ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షకు 7వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సుమారు రూ.5 కోట్ల వరకు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఆగస్టు 15లోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేవారికి రూ.100 మాత్రమే పరీక్ష రుసుము అని, ఆపైన చేసుకునే వారు రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. తిరుపతి బ్రాంచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రమణ్యం, నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొరాయించిన సర్వర్



తిరుపతిలోని 8, 9 డివిజన్లలో సర్వర్లు మొరాయించడంతో వేచి ఉన్న వద్ధులు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలో మొత్తం 19,191 మంది పింఛనుదారులు ఉండగా మొదటి రోజు 18,441 మంది లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 96.1 శాతం మందికి సచివాలయ సెక్రటరీలు పింఛన్లను అందజేశారు. అయితే ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సర్వర్ మొరాయించింది. దీంతో పింఛన్ల పంపిణీకి కొంత అంతరాయం ఏర్పడింది. లబ్ధిదారులు సచివాలయ సిబ్బంది వద్దే గంటల తరబడి నిరీక్షించారు. సర్వర్ మొరాయించడంతో పింఛన్ల పంపిణీ సాయంత్రం వరకు కొనసాగింది. పింఛన్ల పంపిణీలో కమిషనర్ మౌర్యతో పాటు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**పనులు వదులుకుని..**

ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ కారణంగా లబ్ధిదారులు రోజంతా ఇంటి వద్ద ఉండాల్సి వచ్చింది. గతంలో వార్డు వలంటీర్ల ద్వారా ఉదయం ఐదు నుంచి ఏడు గంటల్లోపే 90 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేసేవారు. దీంతో లబ్ధిదారులు పింఛన్‌ను ఉదయం ఏడులోపే తీసుకుని ఎవరి పనులకు వారు వెళ్లేవారు. అయితే సెక్రటరీలు పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో రోజంతా సమయం పడుతోంది. దీనికితోడు సర్వర్ సమస్య ఎదురవడంతో సిబ్బంది ఎప్పుడు ఇంటి దగ్గరికి వస్తారా ? అని లబ్ధిదారులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఎదురైంది. చివరి వ్యక్తికి పింఛన్ అందుకునే సమయం సాయంత్రం కావడంతో రోజంతా వారి వ్యక్తిగత పనులు పూర్తిగా వదులుకుని పడిగాపులు కాశారు. పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ ఉదయం పది నుంచి సాఫీగా సాగింది.

## పటిష్టంగా నిర్వహించండి

- అధికారులకు కమిషనర్ ఎస్.మౌర్య ఆదేశాలు



చెత్త నిర్వహణ ప్లాంటును పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతిలో ఉత్పత్తి అయ్యే చెత్తను వంద శాతం సెగ్రిగేషన్ (వేరు)చేసి తీరాల్సిందేనని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్.మౌర్య స్పష్టం చేశారు. అధికారులతో కలిసి గురువారం కమిషనర్ మౌర్య తూకివాకం గ్రీన్ సిటీని సందర్శించారు. అక్కడ అమలవుతున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుల వివరాలను, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. చెత్త ద్వారా తయారుచేసే ఉత్పత్తులు, వాటి ద్వారా కార్పొరేషన్కు వస్తున్న ఆదాయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణను మరింత పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించండి



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిసిన ఆర్పీలు

తిరుపతి(అలిపిరి): ఉద్యోగ భద్రత కల్పించాలని.. సర్వసభ్య సమావేశంలో ఆమోదించినా తిరిగి అధికారులు లెక్కలు చూపాలని వేధింపులకు గురి చేస్తున్నారని ఆర్పీలు గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు విన్నవించారు. ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కొందరి ఆర్పీల లాగిన్స్ హోల్డ్ చేశారని.. వీటిని పునరుద్ధరణ చేయించాలని కోరారు. అలాగే మహిళా మార్టులో నెలకు రూ.50 వేలకు సరుకులు కొనాలని ఒత్తిడి చేస్తున్నారని, సభ్యులు కొనుగోలుకు ఇష్టపడడం లేదని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో మెప్మా అధికారులు, ఆర్పీలతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

### ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ

తిరుపతి తుడా: పెంచిన పింఛన్‌తో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారుల అందరికీ నేరుగా ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహయాదవ్, మహేష్‌యాదవ్, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలో ఆయన ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అంతకు ముందు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ మునిశేఖర్, సురేంద్రరెడ్డి, దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. గురువారం ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు విద్యా సామగ్రిని వితరణ చేయడంపై అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

## మార్కెట్లో తాగునీటి సదుపాయం

తిరుపతి కల్చరల్: ఇందిరా ప్రియదర్శి కూరగాయల మార్కెట్‌కు విచ్చేసే ప్రజలకు, వ్యాపారుల సౌకర్యార్థం ఏపీ యాదవ మహాసభ సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యాన్ని గురువారం ప్రారంభించారు. నిత్యం మార్కెట్‌కు వేలాదిమంది ప్రజలు విచ్చేయడంతో పాటు మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే వారికి తాగునీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ఏపీ యాదవ మహాసభ సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి మార్కెట్‌లో వారికి నిత్యం తాగునీటి సదుపాయాన్ని సేవాదృక్పథంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీటీడీ రిటైర్డ్ డెప్యూటీ ఈఓ చిన్నం గారి రమణ, మాజీ ఎమ్మెల్యే మోహన్, అన్నా రామచంద్రయ్య యాదవ్, కార్పొరేటర్ సంధ్య యాదవ్, మార్కెట్ కాంట్రాక్టర్ గీత, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు రుయాలో చికిత్స

తిరుపతి తుడా: బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తిరుపతి రుయా అత్యవసర విభాగానికి తరలించారు. మొత్తం 18 మంది క్షతగాత్రులను 108 ద్వారా తీసుకువచ్చారు. రుయా అత్యవసర విభాగంలో మెరుగైన వైద్యం అందించారు. ఇందులో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన 14 మందికి స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అందించి పంపించారు. చికిత్స నిమిత్తం రుయాలోకి తీసుకువచ్చిన క్షతగాత్రులతో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం నిండిపోయింది. తీవ్ర గాయాలతో వచ్చిన క్షతగాత్రుల రోదన కంటతడి పెట్టించింది. కర్ణాటక బస్సులో తమతో పాటు ప్రయాణిస్తున్న తమవారికి ఏం జరిగిందో తెలుసుకునేందుకు క్షతగాత్రులు ఆరా తీశారు. కొంత సేపటికి బంధువులతో నిండిపోయింది. విషయం తెలుసుకున్న రుయా అధికారులు వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. అలానే పోలీసులు, ఇతర అధికారులు రుయా అత్యవసర విభాగానికి చేరుకుని ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. తీవ్రంగా గాయపడిన నలుగురు ఎక్స్‌రే, సిటీ స్కాన్లు పూర్తి చేసి తదుపరి వైద్య సేవలు అందిస్తున్నారు. శివమ్మ (60), చంద్ర (70), షహెర్తుల్లా (48), కండక్టర్ తులసి(40) తీవ్రంగా గాయపడిన వారిలో ఉన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



వారోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవిప్రభ



పాకాల: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

- రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభ

తిరుపతి తుడా: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, పుట్టిన మరుక్షణం నుంచే బిడ్డకు తల్లిపాలు పట్టవచ్చని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభ అన్నారు. తల్లిపాలు వారోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని గురువారం రుయాలోని చిన్నపిల్లల విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చంటిబిడ్డలకు తల్లిపాలు పట్టడంపై కలిగే బహుళ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిపాలు పట్టడం వల్ల పిల్లలు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాల ద్వారానే లభిస్తాయన్నారు. బిడ్డకు తీవ్రమైన వ్యాధులు సోకకుండా రక్షిస్తాయని తెలిపారు. తల్లీబిడ్డల మధ్య భావోద్వేగ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ ప్రతి తల్లీ తన బిడ్డకు పాలు పట్టడం ద్వారా ఎంతో ఉత్తేజాన్ని, ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. బిడ్డకు పాలు పట్టడం వల్ల అందం తగ్గుతుందని, శారీరక మార్పులు చోటు చేసుకుంటాయనే భ్రమలో ఉంటున్నారన్నారు. ఇది ముమ్మాటికీ తప్పిదమని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ చిన్నపిల్లల డాక్టర్ ఆరుముగం,ఇతర వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం**

పాకాల: పుట్టిన బిడ్డకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని సత్యమ్మ గుడి వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్, భగవతి, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, ఉక్తహోమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. అనంతరం యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. అదే విధంగా విశ్వక్సేన, ద్వారపాలకులు, భాష్యకార్లు, గరుడాళ్వార యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామివారికి అర్చక పండితులు పవిత్రాలు సమర్పించారు. కాగా సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఆ ఉద్యోగుల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి అర్చన

తిరుపతి లీగల్: తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్ కరీముల్లా, సీనియర్ సూపరింటెండెంట్ అస్లం ఖాన్ సేవలు మరువలేనివని తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి అర్చన తెలిపారు. ఇద్దరు ఉద్యోగులు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. స్థానిక నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో ఇద్దరికీ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి అర్చన మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగుల పని తీరును జూనియర్ ఉద్యోగులు గుర్తించి స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఇద్దరు ఉద్యోగులను శాలువలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగవ అదనపు జిల్లా జడ్జి కోర్టు సూపరింటెండెంట్ శివరాం రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ నేతల హర్షం



అంబేడ్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న మాదిగ పోరాట సమితి నాయకులు

తిరుపతి సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై తిరుపతి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. గురువారం ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్ల పోరాటానికి నేడు న్యాయం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన అన్ని పార్టీలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ పోరాట సంఘాల నేతలు పాల్గొన్నారు.

**మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం**

తిరుపతి(అలిపిరి): టీటీడీ మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును పురస్కరించుకుని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ చిత్రానికి టీటీడీ పరిపాలన భవనం ఎదుట పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహాజన సోషల్ పార్టీ అధ్యక్షుడు వై.విశ్వనాథం, టీటీడీ ఎంఈఎఫ్ గౌరవ అధ్యక్షుడు టి.దాసు, టీటీడీ ఎంఈఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడు మిరియాల సుబ్బరాజు, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర, ఎంఎస్పీ, ఎస్వీయూ ఎంఈఎఫ్ నాయకులు, సంగీతం సుబ్రమణ్యం, స్విమ్స్ ఎంఈఎఫ్ నేతలు పాల్గొన్నారు.


## షాపులు పెట్టకుండా చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: విష్ణునివాసం మెయిన్ గేట్‌కు ఎదురుగా ఉన్న ఆటోస్టాండ్ వద్ద అక్రమంగా షాపులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆటో యూనియన్ లీడర్ రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ విష్ణునివాసం మెయిన్ గేట్ ఎదురుగా షాపులు పెట్టడం కారణంగా ఆటో డ్రైవర్ల కడుపుకొడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి షాపులు లేకుండా చూడాలన్నారు. భవిష్యత్‌లో షాపులు పెట్టకుండా తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూనియన్ నేతలు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

# మీతో బంధం విడదీయరానిది..!



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పక్కన తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ''చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం అందరూ మీ శక్తి మేరకు కష్టపడ్డారు.. ప్రజలు మార్పు కోరారు.. ఎన్నికల్లో గెలుపు.. ఓటమి సహజం.. ఓటమి చెందినంత మాత్రాన కుంగిపోయేది లేదు.. నాకు ఎన్ని కష్టాలు వచ్చినా మీ చేయి వదలను.. మీరు కూడా అలాగే క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలకు ఎవరికి ఏ కష్టం వచ్చినా క్షణాల్లో అక్కడకు చేరాలి.. అండగా నిలబడాలని.. అందులో నేను కూడా భాగమవుతా.. గతంలో కంటే రెట్టింపు బాధ్యతతో పనిచేయడానికి సిద్ధం కావాలి.. ప్రతిపక్షంలో పోరాటాలు మనకు కొత్త ఏమీ కాదు.. అధికార పార్టీ ఆగడాలను సమర్థవంతంగా తిప్పి కొట్టడానికి అందరూ సంఘటితం కావాలని విజ్ఞప్తి చేస్తున్నా..'' అంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా, నిర్దేశం చేశారు. షిరిడీలో బాబా దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో తన వెంట వచ్చిన రెండు వేలకు పైగా పార్టీ నేతలు, కార్యకర్తలు, సానుభూతి పరులతో గురువారం షిరిడీలో చెవిరెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

**వసుధైక కుటుంబం మనది**

గత ఎన్నికల్లో చాలామంది ఓటమి చెందిన అభ్యర్థులు ''నా కార్యకర్తలు కష్టపడలేదు.. నా ప్రజలు మోసం చేశారని.. ఆవేదన వ్యక్తం చేస్తూ పార్టీ కేడర్‌ను వదిలేసి వెళ్లిపోయారు. కానీ నేను అలా చేయలేదు.. కష్టమైనా సుఖమైనా మీతోనే ఉంటా.. మీ అందరితో కలసి ఉండటమే నాకు ఇష్టం.. అలాగే రేపు మన పార్టీలో ఎవరికి కష్టం వచ్చినా సరే మీరంతా ఒక్కొక్కరు ఐదుగురిని వెంట తీసుకుని వస్తే పది వేల మంది ఒకచోటకు చేరుతారు.. అప్పుడే ప్రత్యర్థి పార్టీ వాళ్లకు భయం పుడుతుంది. పార్టీ పిలుపు ఇస్తే అందరూ ధైర్యంగా ఒక చోట రావడానికి సన్నద్ధం కావాలి'' అని చెవిరెడ్డి సూచించారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ మీ అందరితో కలసి నాలుగు రోజుల షిరిడీ యాత్ర మంచి అనుభూతినిచ్చిందన్నారు

**కేడర్‌లో జోష్..**

ఆత్మీయ సమావేశంలో చెవిరెడ్డి మాటలకు పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ కనిపించిది. షిరిడీ యాత్ర ప్రారంభం నుంచి ఆయన అందించిన సేవలు, ఓటమి బాధలో కూడా ఆయన పార్టీ క్యాడర్ పట్ల చూపిన శ్రద్ధ, అందించిన సౌకర్యాలతో సంతృప్తి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు విజిల్స్ వేస్తూ, కేకలు పెడుతూ మద్దతు తెలిపారు. చెవిరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. మోహిత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు.